# ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు



- ప్రజలు నేరుగా వాట్సాప్‌లో ఫిర్యాదులు చేసే అవకాశం మంత్రి పేషీ, కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక వాట్సాప్ నంబర్లు
- మంత్రి జూపల్లి ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్
- ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శుక్రవారం 9 అక్టోబర్ 2026 పేజీలు : 8


# మీడియా రంగానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం

## వాస్తవ, విశ్వసనీయ సమాచారమే జర్నలిస్టుల లక్ష్యం కావాలి

## తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి) సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో మీ డియా కీలక పాత్ర పోషిస్తుందని

# జిల్లాలో ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయానికి పకడ్బందీ చర్యలు



ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి) జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రెవెన్యూ, అటవీ, గృహ నిర్మాణ శాఖల మధ్య సమన్వయం పకడ్బందీగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ హౌసింగ్ ఇంజనీర్లు, తహశీల్దార్లు, అటవీ శాఖ అధికారులతో

# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళిక
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 8 ,( ప్రజాజ్యోతి ) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచి, విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.



# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలి

## పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలి

## అక్టోబర్ 12న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి: సీఐటీయూ

**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రతి నెల రావాల్సిన జీతాలు, బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ మధునమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పథకం నిర్వహణను ఇతర సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికులకు మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డి. రఫీయా మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.




ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ తమ బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 12న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సవిత, నాయకులు వెంకటలక్ష్మి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

## వాట్సాప్ ద్వారా నేరుగా ఫిర్యాదులు..

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలు ఇకపై ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పేషీలోనూ ప్రత్యేక వాట్సాప్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేషీ వాట్సాప్ నంబర్ 8500689596, మంచిర్యాల కలెక్టరేట్ వాట్సాప్ నంబర్ 9492123642గా తెలిపారు. ప్రజలు ఈ నంబర్లకు కాల్ చేయకుండా కేవలం వాట్సాప్ ద్వారా మెసేజ్ రూపంలోనే తమ ఫిర్యాదులను పంపించాలని సూచించారు. ఫిర్యాదులో సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, సంబంధిత ఫొటోలను జత చేయాలని తెలిపారు. తద్వారా సమస్యను స్పష్టంగా గుర్తించి, సంబంధిత శాఖకు ఫిర్యాదును పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా అందించడంతో పాటు, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఏసీబీ వలలోచిక్కిన ఖానాపూర్

### ఎఫ్ ఎస్ ఓ అయిండ్ల రవీందర్ ఏసీబీ దాడులతో కలకలం



**ఖానాపూర్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి )** ఓ కలప డిపోకు చెందిన రెన్యువల్ కేసులో 12 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం లో సెక్షన్ ఆఫీసర్ గా పని చేస్తున్న అయిండ్ల రవీందర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు గత కొంతకాలంగా తమ కలప డిపో రెన్యూవల్ కోసం ముప్పు తిప్పలు పెడుతూ చివరకు 20వేల లంచం అడిగినట్లు దాన్ని బేరం ఆడి 12వేల కుదించుకుని ఏ సి బి ని ఆశ్రయించిన కలప డిపో యజమాని కామోజీ రవితేజ ఈ మేరకు గురువారం ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకొని కేసు రిజిస్టర్ చేసి రిమాండ్కు పంపినట్లు అధికారులు తెలిపారు ఎ సి బి దాడుల వల్ల ఖానాపూర్‌లో కలకలం రేగింది గతంలో ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో నరేందర్ ఏసీబీకి చిక్కిన తర్వాత మళ్ళీ ఇలా జరగడంతో అధికారుల గుండెల్లో గుబులు రేగింది ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ జీతాలు తీసుకొని అదనంగా అక్రమ సంపాదన పేరా లంచం తీసుకున్నట్లయితే శిక్ష తప్పదని ఇలాంటి అవినీతి అధికారులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని అదిలాబాద్ ఏసీబీడిఎస్పి మధు తెలిపారు

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పెద్దల చంద్రకాంత్



**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా రామారావుపేట గ్రామానికి చెందిన పెద్దల చంద్రకాంత్ నియమితులయ్యారు. కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగేటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగంద వెంకటేష్ సూచనతో, రాష్ట్ర కార్యదర్శి పరంది రమేష్ చంద్ర సమక్షంలో పెద్దల చంద్రకాంత్‌కు జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులను పరిరక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పెద్దల చంద్రకాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# రూ.6 వేల నుంచి రూ.1.10 లక్షలకు..!

## 20 ఏళ్లలో భారీగా పెరిగిన బొగ్గు గని కార్మికుల పి ఎల్ ఆర్ బోనస్

## గత మూడేళ్లలో పెరుగుదలలో హెచ్చుతగ్గులు.. పండుగ వేళ కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా





**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బొగ్గు గని కార్మికుల ఆర్థిక ప్రయోజనాల్లో కీలకమైన పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (పీఎల్ఆర్) బోనస్ గత 20 ఏళ్లలో భారీగా పెరిగింది. కోల్ఇండియా పరిధిలోని బొగ్గు గని సంస్థలతో పాటు సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న నాన్–ఎగ్జిక్యూటివ్ అనగా కార్మికులకు చెల్లిస్తున్న పీఎల్ఆర్ 2007లో రూ.6 వేలుగా ఉండగా, 2026లో రూ.1,10,250కు చేరింది. అంటే రెండు దశాబ్దాల కాలంలో రూ.1,04,250 మేర పెరిగింది. అయితే బోనస్ మొత్తం ఏటా పెరుగుతున్నప్పటికీ, ప్రతి ఏడాది పెరిగిన మొత్తం మాత్రం ఒకే విధంగా లేకపోవడం గమనార్హం. 2007లో రూ.6 వేలుగా ప్రారంభమైన పీఎల్ఆర్ 2008లో రూ.8,350కు, 2009లో రూ.10 వేలకు చేరింది. 2010లో రూ.15 వేలు, 2011లో రూ.21 వేలు, 2012లో రూ.26,500, 2013లో రూ.31,500గా పెరిగింది. 2014లో రూ.40 వేలకు చేరగా, 2015లో రూ.48,500, 2016లో రూ.54 వేలు, 2017లో రూ.57 వేలు, 2018లో రూ.60,500కు చేరింది. అనంతరం 2019లో రూ.64,500, 2020లో రూ.68,500, 2021లో రూ.72,500, 2022లో రూ.76,500గా పెరిగింది. 2023లో రూ.85,500, 2024లో రూ.93,750, 2025లో రూ.1,03,000కు చేరగా, 2026లో రూ.1,10,250కు చేరింది.

**గత మూడేళ్లలో తగ్గిన పెరుగుదల...........**

పీఎల్ఆర్ బోనస్ మొత్తం ప్రతి ఏడాది పెరుగుతున్నా, గత మూడేళ్ల పెరుగుదలలో మాత్రం హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. 2024లో రూ.8,250, 2025లో రూ.9,250 పెరగగా, 2026లో రూ.7,250 మాత్రమే పెరిగింది. అంటే 2025తో పోలిస్తే 2026లో పెరుగుదల రూ.2 వేల మేర తగ్గింది. దీంతో బోనస్ మొత్తం కొత్త గరిష్ఠానికి చేరినా, పెరుగుదల వేగం మాత్రం గత ఏడాదితో పోలిస్తే తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలోనూ పీఎల్ఆర్ పెరుగుదలలో హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. 2014, 2015 సంవత్సరాల్లో రూ.8,500 చొప్పున పెరగగా, 2023లో రూ.9 వేలు, 2024లో రూ.8,250, 2025లో రూ.9,250 పెరుగుదల నమోదైంది. 2026లో మాత్రం రూ.7,250 పెరుగుదలకే పరిమితమైంది.

**పండుగ వేళ కుటుంబాలకు ఆర్థిక భరోసా.....**

ఏది ఎలా ఉన్నా.. బొగ్గు గని కార్మికులకు పండుగ సందర్భంగా లభించే పీఎల్ఆర్ బోనస్ వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపడంతో పాటు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతోంది. పండుగ ఖర్చులు, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఇతర అత్యవసర అవసరాలకు ఈ అదనపు ఆదాయం కార్మిక కుటుంబాలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది. కష్టపడి పనిచేసే బొగ్గు గని కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆనందంగా పండుగను జరుపుకునేందుకు ఈ బోనస్ దోహదపడుతోంది. కోల్ఇండియా పరిధిలోని సంస్థల్లో పీఎల్ఆర్ బోనస్‌ను దసరా పండుగకు ముందు చెల్లించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అదే విధంగా సింగరేణి సంస్థలో దీనిని "దీపావళి బోనస్ " గా దీపావళి పండుగకు ముందు చెల్లించడం సంప్రదాయంగా వస్తోంది. దీంతో బోనస్ కోసం ఎదురుచూసే వేలాది కార్మిక కుటుంబాలకు పండుగకు ముందే అదనపు ఆర్థిక సహాయం అందుతుంది. బోనస్ మొత్తం ఎంత పెరిగింది, ఎంత తగ్గింది అన్నది ఒకవైపు ఉన్నా.. పండుగ సమయంలో కార్మికుల కుటుంబాల్లో చిరునవ్వులు పూయించడంలో పీఎల్ఆర్ బోనస్ ఎంతో కీలకంగా మారుతోంది.

# ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్యానల్‌ను గెలిపించాలి

**ఆర్టీసీ బలోపేతం.. కార్మికుల ఉద్యోగ భద్రతే లక్ష్యం**

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్**





**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక పరిషత్ ఎన్నికల బరిలో నిలుస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్ తెలిపారు. మంచిర్యాల డిపో ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ సంస్థను మరింత బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు కార్మికులు, ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత పరిరక్షణే కార్మిక పరిషత్ ప్రధాన లక్ష్యమని మణిరాం సింగ్ పేర్కొన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం, కొత్త డిపోల ఏర్పాటు, మహిళా సిబ్బందికి మెరుగైన రక్షణ, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వంతో చర్చించి, నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్మిక పరిషత్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వన్‌మెన్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడం తమ ప్రధాన డిమాండ్లలో ఒకటని తెలిపారు. ప్రయాణికులు తప్పనిసరిగా టికెట్ తీసుకునేలా అవగాహన కల్పించి, టికెట్ తీసుకునే బాధ్యతను ప్రయాణికులపైనే ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా డ్రైవర్లపై అదనపు బాధ్యత, ఒత్తిడి తగ్గి వారికి ఉద్యోగ భద్రత కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం కార్మిక పరిషత్ నిరంతరం పోరాడుతుందని మణిరాం సింగ్ తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కృషి చేసే కార్మిక పరిషత్ టైర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లు మల్లయ్య, మంచిర్యాల జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఓ. జీవరత్నం, అవుల సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జ దుర్గయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎన్. పుల్లయ్య, డి. అంజయ్య, సీహెచ్. కిష్టయ్య, ఆర్. గంగాధర్ గౌడ్, ఎస్.కె. అజ్గర్ భాష, బి. సత్యనారాయణ, బెల్లంపల్లి మండల్ అధ్యక్షులు రామటెంకి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోర్.. గద్దె చోడ్ ఉద్యమానికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మద్దతు

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

**మంచిర్యాల, 8,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న 'ఓటు చోర్.. గద్దె చోడ్' ఉద్యమానికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నాయంటూ పలు రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలు, ఈ అంశంపై వెలువడుతున్న మీడియా కథనాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై సమగ్ర విచారణ అవసరమని సమావేశంలో నాయకులు అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాల్లో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై పారదర్శకంగా సమీక్ష జరిపి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత పెంచేందుకు పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని వారు అన్నారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాలకు సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా "ఓటు చోర్.. గద్దె చోడ్", "ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి", "ఈవీఎంలకు బదులు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలి", "ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి" అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ. గంగయ్య, సలహాదారుడు ఎం. అంజయ్య, నాయకులు బూర్ల జ్ఞాని, గజెల్లి సుదర్శన్, పి. రాంరెడ్డి, కాటం లక్ష్మణ్, ఏ. రాజేశం తదితరులు పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

**బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్**

**ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో పాల్గొన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు**

**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల చదువులను అడ్డుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పిల్లి సంజయ్ కిరణ్ అధ్యక్షతన ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంటు సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రైతుబంధుకు, మెట్రోకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మాత్రం నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం కూడా ఇదే వైఖరి అవలంబించింది దని, తక్షణమే బకాయిలను కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న బహుజన మేధావి వి.జి.ఆర్. నారగోని మాట్లాడుతూ విద్యకు నిధులు కేటాయించడం ప్రభుత్వానికి పెట్టుబడి వంటిదన్నారు. విద్యాభివృద్ధి దేశ అభివృద్ధికి, స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించడం దేశ అభివృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువులకు అవసరమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా పెద్ద కార్పొరేట్ సంస్థలకు నిధులు కట్టబెట్టడం సరికాదన్నారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే అన్ని రాజకీయ పార్టీలు, బహుజన సంఘాలను కలుపుకొని హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల పట్ల వివక్ష చూపడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళన చేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై విజిలెన్స్ తనిఖీల పేరుతో ఒత్తిడి, బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. మల్లారెడ్డి వంటి పెద్ద యూనివర్సిటీల్లో నిర్వహించిన తనిఖీల ద్వారా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్న ప్రభుత్వం వాటిని తక్షణమే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలలు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోతే అనేక కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ కళాశాలల బకాయిలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యాజమాన్యాల ఖాతాల్లోనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు జమ చేయాలని కోరారు. విద్యార్థుల చదువుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కమల్ మహారాజ్, రాసాల వినోద్ యాదవ్, రాము యాదవ్, పూసల సాయిబాబా, బాలయ్య ముదిరాజ్, చందా మల్లయ్య, పోదకంటి రాంబాబు చారి, మేకల సుమన్, కందేల సుమన్ తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం, ధర్మసమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఏదునూరి రమేష్, నాయకులు మేడిరాజు, సీనియర్ నాయకుడు జంగంపల్లి రామస్వామి పాల్గొన్నారు.





# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట

## ఓట్ల తొలగింపులో అవకతవకలపై నిరసన..
## సీఈసీ రాజీనామాకు మంత్రి వివేక్ డిమాండ్.

**మందమర్రి, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి):** ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపు ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మందమర్రిలో భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపు మేరకు పాత బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గురువారం చేపట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ధర్నాలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపులో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి ఓటు విలువను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓట్లు తొలగించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.



ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ధర్నా సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, మైనారిటీ విభాగం, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు హాజరు కావడంతో పాత బస్టాండ్ పరిసరాల్లో కొంతసేపు రాజకీయ సందడి నెలకొంది.

# మంచిర్యాల లో అక్రమాలపై పార్టీ విచారణ జరిపించాలి

**బీజేపీ సీనియర్ నాయకుల డిమాండ్**

**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** బీజేపీని నియంతృత్వ ధోరణిలో నడిపిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు, ఆయనకు వత్తాసు పలుకుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్‌లను పార్టీ బాధ్యతల నుంచి తప్పించి బీజేపీని కాపాడాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు బొలిశెట్టి తిరుపతి, మడిపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో రఘునాథ్‌రావు, వెంకటేశ్వర్‌గౌడ్ కలిసి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితుల భుజంపై తుపాకీ పెట్టి బీసీ నాయకులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల రఘునాథ్‌రావు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొందరు ఆయన అనుచరులు బీజేపీ సీనియర్ కార్యకర్తలను వ్యక్తిగతంగా దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడటమే కాకుండా కుటుంబాలపై ఆరోపణలు చేయడం, ఇళ్లపై దాడులు చేస్తామని హెచ్చరించడం వంటి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ వ్యవహారానికి రఘునాథ్‌రావు, వెంకటేశ్వర్ గౌడ్‌లు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తమపై వచ్చిన ఆరోపణలను ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేస్తామని, పార్టీకి చెందిన వారు కాదని బెదిరించడం ద్వారా బీసీ నాయకులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ నిధుల



వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన ఆరోపణలను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. బీజేపీని సొంత జాగీర్‌లా భావించి వ్యవహరించడం సరికాదని విమర్శించారు. జిల్లా పార్టీ ఇన్‌చార్జి ఓదెలు ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. తాము చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రఘునాథ్‌రావు, వెంకటేశ్వర్ గౌడ్‌లను పార్టీ బాధ్యతల నుంచి తప్పించి, క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలతో బీజేపీని జిల్లాలో బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ ఇన్‌చార్జికి అపారమైన సిద్ధాంతపరమైన అనుభవం ఉందని, పార్టీ అభివృద్ధి కోసం తప్పు చేసిన వారిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి జిల్లాలో పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

## సింగరేణి పాఠశాలలో పౌష్టిక అల్పాహార కార్యక్రమం ప్రారంభం.

**విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రతకు పౌష్టికాహారం ఎంతో కీలకం**

**- జీఎం ఎన్. రాధాకృష్ణ.**



**మందమర్రి, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి):** విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పౌష్టిక అల్పాహార కార్యక్రమాన్ని మందమర్రి సింగరేణి హైస్కూల్‌లో గురువారం ప్రారంభించారు. మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఉదయం పూట విద్యార్థులకు పౌష్టికాహారం అందడం వల్ల ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు.మందమర్రి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మోడర్న్ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా సింగరేణి పాఠశాల విద్యార్థులకు కూడా అక్కడి నుంచి అల్పాహారం అందించాలని కోరినట్లు తెలిపారు. తాజాగా ఆ కార్యక్రమం అమల్లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.మోడర్న్ కిచెన్ కేంద్రాల నిర్మాణానికి సింగరేణి సంస్థ తన సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.50 కోట్లు కేటాయించినట్లు జీఎం తెలిపారు. ఇందులో మంచిర్యాల జిల్లాలోని మోడర్న్ కిచెన్ కేంద్రానికి రూ.7.5 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో, పరిశుభ్రమైన వాతావరణంలో హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన నిపుణులైన వంట సిబ్బంది ఆహారాన్ని సిద్ధం చేస్తున్నారని తెలిపారు.సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా పరిసర ప్రాంతాల్లో విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమానికి నిధులు కేటాయించడం సంతృప్తినిస్తోందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉంటూ చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో జన్నారంలో రెండు బ్రిడ్జిలకు సర్వే దసరా తర్వాత పనులు ప్రారంభం

**జన్నారం,అక్టోబర్8(ప్రజాజ్యోతి)** జన్నారం మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోంది. మండలం లోని రెండు కీలక ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి మార్గం సుగమమైంది.ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ చొరవతో జన్నారం-గొండుగూడ వాగుపై 3 కోట్ల రూపాయలతో, జన్నారం-లోతొర్రె (లక్ష్మీపూర్ తండా) కడెం కెనాల్ పై కోటి రూపాయలతో, మొత్తం 4 కోట్ల రూపాయలతో జీవో నెంబర్ 59 ద్వారా రెండు బ్రిడ్జిలను మంజూరు చేయించారు.బ్రిడ్జిలు నిర్మించే ప్రదేశాలను సర్వే చేయడం కోసం పంచాయతీరాజ్ డిపార్ట్ మెంట్ నుండి హైదరాబాద్ నుండి వచ్చిన సర్వే టీం, ఐటీడీఏ,ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ట్రైబల్ వెల్ఫేర్ సబ్ డివిజన్ దండేపల్లి డిఈఈ టి. సాయికృష్ణ, ఏఈఈ ఎన్.హారిక, బి.శ్రీకాంత్ ప్రదేశాలను పరిశీలించారు. దసరా తర్వాత రెండు బ్రిడ్జిల పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, సర్పంచులు అజ్మీర కళావతి, బోడ శంకర్, ఉప సర్పంచ్ మండడి నరేశ్వర్, వార్డు సభ్యులు నూనావత్ బాగువందాస్, బోడ మోహన్, భూక్యా శివకుమార్, రాథోడ్ వసంత్ రావు, పాపా గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నిజమవుతున్నందుకు ఇరు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కు ధన్యవాదాలు తెలిపారు.



# బీఆర్ఏఓయూ స్నాతకోత్సవంలో మందమర్రి యువకుడికి బంగారు పతకం

**మందమర్రి, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి ):**డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ) 27వ స్నాతకోత్సవంలో మందమర్రి పట్టణానికి చెందిన మద్దెల ప్రశాంత్ బంగారు పతకం సాధించారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రశాంత్ బంగారు పతకాన్ని అందుకున్నారు. మందమర్రి విద్యానగర్‌లోని రాజన్నలవాడకు చెందిన మద్దెల విజయలక్ష్మి, కీర్తిశేషులు నాగయ్య యాదవ్ దంపతుల కుమారుడైన ప్రశాంత్.. బీఆర్ఏఓయూలో బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) కోర్సును అభ్యసించారు. కోర్సులోని అన్ని సబ్జెక్టులను ఒకేసారి పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో అత్యధిక మార్కులు సాధించడంతో ఆయనకు బంగారు పతకం లభించింది.ప్రస్తుతం ప్రశాంత్ కేంద్ర ప్రభుత్వ శాఖలో గెజిటెడ్ అధికారి హోదాలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇద్దరు అన్నయ్యలు ఉన్నారు. పెద్ద అన్నయ్య హైకోర్టు న్యాయవాదిగా, మరో అన్నయ్య హైదరాబాద్‌లో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ప్రశాంత్ తండ్రి నాగయ్య యాదవ్ సింగరేణి సంస్థలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేశారు. ఆయన మరణానంతరం తల్లి విజయలక్ష్మి కుటుంబ బాధ్యతలను చేపట్టారు. చిన్న దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించడంతో పాటు పిల్లలను ఉన్నతంగా చదివించారు. తల్లి అందించిన




ప్రోత్సాహం, పట్టుదల తన విజయానికి ఎంతో దోహదపడిందని ప్రశాంత్ తెలిపారు.సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ప్రశాంత్.. వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి బంగారు పతకం సాధించడం కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు గర్వకారణంగా నిలిచింది. ఆయన సాధించిన విజయం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభినందించారు. భవిష్యత్తులో విద్య, వృత్తి రంగాల్లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సింగరేణి సమస్యల పరిష్కారానికి కార్మిక గర్జన



**హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సన్నాహక సదస్సు**

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

**మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరు**

**ఈనెల 14న గోదావరిఖనిలో భారీ బహిరంగ సభ**

**వాస్తవ లాభాలపై 36 శాతానికి తగ్గకుండా లాభాల వాటా ప్రకటించాలి**

**సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి**

**మంచిర్యాల, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** సింగరేణి కార్మికుల తక్షణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయడానికి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సన్నాహక సదస్సు నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావుతో పాటు వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, టీబీజీకేఎస్ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా సింగరేణి సంస్థ వాస్తవ లాభాలను ప్రకటించకపోవడంపై సదస్సులో నాయకులు ప్రశ్నించారు. వాస్తవ లాభాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు 36 శాతానికి తగ్గకుండా కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో సంస్థ భవిష్యత్ తరాల నిర్మాణం కోసం ఖర్చు చేసినట్లు పేర్కొన్న రూ.6,323 కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ కార్మిక సంఘాలు ఇచ్చిన హామీ మేరకు నెలకు మూడు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి 100 శాతం ఇన్‌వాల్యుయేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ విదేశీ బొగ్గును తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఎలాంటి షరతులు విధించకుండా నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ పరికరాలు, మౌలిక వసతులు, సరైన పనిముట్లు, యంత్రాలు, యంత్ర విడిభాగాలను సమకూర్చాలని కోరారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈనెల 14న గోదావరిఖని కార్మిక గర్జన సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, టీబీజీకేఎస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని సన్నాహక సదస్సులో పిలుపునిచ్చారు.

## పాఠశాల ఆవరణలో పచ్చదనాన్ని పెంచాలి.



**మందమర్రి, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి ):** సింగరేణి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని మరింత పెంచాలని మందమర్రి ఏరియా జీఎం, ఎన్. రాధాకృష్ణ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి న ఆయన.. అక్కడ పాఠశాల సిబ్బంది పెంచుతున్న కూరగాయ లు పండ్ల మొక్కలను పరిశీలించారు.పాఠశాల ఆవరణలో అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచడం అభినందనీయమని జీఎం పేర్కొన్నారు. మొక్కలను కోతుల నుంచి రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ మేరకు అటవీశాఖ అధికారి నవీన్, సివిల్ అధికారి మదీనా భాషాతో మాట్లాడిన జీఎం.. మొక్కలకు నష్టం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో మెష్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించడంతో పాటు వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణలో పచ్చదనం పెరగడం విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందని జీఎం పేర్కొన్నారు.

## పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం.సర్పంచ్ సక్రు నాయక్.



**జన్నారం,అక్టోబర్8(ప్రజాజ్యోతి)**పౌష్టికాహారం తీసుకుంటేనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని కవ్వాల్ సర్పంచ్ సక్రు నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి అన్నారు. పోషణ మాస ఉత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున జన్నారం సెక్టార్ పరిధిలోని కవ్వాల్ అంగన్వాడీ కేంద్రంలో ఎస్ హెచ్ జి మెంబర్స్, ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పోషణ మాసంలో చేసిన అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యవంతలవుతారని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నటువంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు బిక్కు, గోవింద్, అంగన్వాడీ టీచర్లు చంద్ర లీల, రజిత, జిజియా తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి......!!!!

**ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి**

**కార్మిక సమస్యలపై వరుస నిర్ణయాలు.. అన్ని సమస్యలకు పరిష్కారం లభించేనా?**

**సమా వేశాలు ఒకే ....హామీలు కార్యరూపం దాల్చేదెప్పుడు.?**

**ఆశగా ఎదురుచూస్తున్న సింగరేణి కార్మికులు**

**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో ఏళ్లుగా నెలకొన్న కార్మిక, ఉద్యోగ, వైద్య, నివాస, ప్రాంతీయ అభివృద్ధి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపుతున్న నేపథ్యంలో కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అందుకు ఊతమిచ్చే విధంగా తాజాగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణి ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ, సింగరేణి ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంను నిర్వహించడం తో సింగరేణి కార్మికుల్లో ఆనందం వ్యక్తమై ఆశలు పెరుగుతున్నాయి సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి కుటుంబాలకు సంబంధించిన సమస్యలు, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా, వాటిని సానుకూలంగా పరిశీలించిన ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, గండ్ర సత్యనారాయణరావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సింగరేణిలో కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాల నుంచి డిస్మిస్ అయిన కార్మికులకు వన్‌టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లో చేరే అవకాశం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించడం ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఒకటిగా నిలిచింది. అదే సమయంలో విధులు నిర్వహించకుండా సమ్మెకు పిలుపునిచ్చిన లేదా సమ్మెలో పాల్గొన్న అధికారులపై, సమ్మెకు నాయకత్వం వహించిన వారిపై నాన్‌మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస్ కింద ఉన్న కేసులను హెచ్చరికలతో పరిష్కరించే అంశంపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు.

**మెడికల్ బోర్డు ఇక ఏరియా ఆసుపత్రుల్లోనే.....**

మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం సింగరేణి కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన పరిస్థితికి స్వస్తి పలకాలని భట్టి విక్రమార్క సూచించారు. ఇకపై సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించి, అక్కడే వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా ఏరియా ఆసుపత్రులను మరింత బలోపేతం చేసి నిపుణులైన వైద్యులు, అత్యవసర వైద్య సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు.

**15 రోజుల్లో డిపెండెంట్ ఉద్యోగాల సమస్య పరిష్కారం....**

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన నియామక ఉత్తర్వులు, ఇతర న్యాయపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు అందజేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అర్హులకు ఇళ్ల స్థలాలు.. నెహ్రూ హౌసింగ్ కాలనీలు...**

సింగరేణికి సంబంధించిన భూముల్లో మిగిలి ఉన్న సుమారు 1,250 ఎకరాల్లో జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను త్వరగా సిద్ధం చేయడంతో పాటు, సింగరేణి భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ జరగని ప్రాంతాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేఅవుట్లు రూపొందించాలని సూచించారు. అవసరమైన చోట నెహ్రూ హౌసింగ్ కాలనీల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

**ఓవర్‌బర్డెన్ దంపుల ప్రభావంపై క్యాన్సర్ స్క్రీనింగ్...**

బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ దంపుల నుంచి వెలువడుతున్న దుమ్ము కారణంగా గని ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభావాన్ని అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**సోలార్ ప్లాంట్లకు ప్రాధాన్యం.....**

సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలను కొంతవరకు తీర్చేలా చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. ఊరి బయట నిరుపయోగంగా ఉన్న భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను కూడా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

**కాలనీలు, మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి అంశాలపై దృష్టి...**

సింగరేణి కాలనీల్లో డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపర్చడంతో పాటు శిథిలావస్థకు చేరిన డీ-టైప్ క్వార్టర్ల స్థానంలో మెరుగైన వసతులతో కొత్త గృహాలను నిర్మించే అంశంపైనా దృష్టి సారించాలని ప్రభుత్వం సూచించింది. సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, కార్డియాక్, క్యాథ్‌ల్యాబ్ వంటి సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ సంస్థల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి అంశాలపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులకు కూడా ఉప ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భూపాలపల్లి ప్రాంతంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి అవసరమైన స్థలాన్ని సింగరేణి నుంచి కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా ఇతర మౌలిక వసతుల కల్పనకు కూడా సంస్థ సహకరించాలని సూచించారు.

**కార్మిక సంఘాల ఒత్తిడికి తోడు ప్రభుత్వ చొరవ....**

సింగరేణిలోని సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు కూడా చాలా కాలంగా తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ కార్మిక




సంఘం ఐఎన్‌టీయూసీ, అలాగే ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీ నాయకులు పలు సమస్యలపై పోరాటాలు, ఆందోళనలు, వినతిపత్రాల ద్వారా ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. మరోవైపు హెచ్ఎంఎస్, సీఐటీయూ, బీఎంఎస్ తదితర సంఘాల నాయకులు కూడా సింగరేణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. మారుపేర్ల సమస్య, లాభాల వాటా చెల్లింపు, అర్హులకు ఇళ్ల స్థలాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, మెడికల్ ఇన్వాలిడేషన్, డిస్మిస్ కార్మికుల పునర్నియామకం, వైద్య సదుపాయాలు, క్వార్టర్లు, కాలనీల సమస్యలు ఇలా అనేక అంశాలు సింగరేణి కార్మికుల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. వీటిలో చాలా సమస్యలు న్యాయపరమైన ప్రక్రియలతో ముడిపడి ఉన్నందున వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**సమా వేశాలు ఒకే ....హామీలు కార్యరూపం దాల్చేదెప్పుడు.?**

సింగరేణి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, సమస్యలను స్వయంగా విని అధికారులకు గడువులతో కూడిన ఆదేశాలు ఇవ్వడం కార్మికుల్లో కొత్త ఆశలు కలిగిస్తోంది. అయితే సమావేశంలో ఇచ్చిన హామీలు, ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంత వేగంగా అమలవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ముఖ్యంగా 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించిన డిపెండెంట్ నియామకాలు, నెలకోసారి నిర్వహించాల్సిన మెడికల్ బోర్డులు, డిస్మిస్ కార్మికులకు వన్‌టైం ఆప్షన్, పేర్ల మార్పు సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు, ఆసుపత్రుల ఆధునీకీకరణ, క్యాన్సర్ స్క్రీనింగ్, సోలార్ ప్లాంట్లు, రామగుండం థర్మల్ కేంద్రం వంటి అంశాలు ఎన్ని రోజుల్లో, ఎన్ని నెలల్లో కార్యరూపం దాలుస్తాయో వేచి చూడాల్సిందే. ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సింగరేణి కార్మికులు ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను ఆశగా చూస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ఒక్కొక్కటిగా అమలైతేనే కార్మికుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది. సింగరేణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న ఈ చొరవ ఎంతవరకు ఫలితాన్నిస్తుందో.. ఇచ్చిన హామీల్లో ఎన్ని కార్యరూపం దాలుస్తాయో.. సింగరేణి కార్మికుల నిరీక్షణకు ఎప్పుడు తెరపడుతుందో వేచి చూడాల్సిందే.

# మహిళలకు సురక్షితమైన పని ప్రదేశాలే లక్ష్యం

## పోష్ చట్టం అమలులో రాజీ లేదు.. ఫిర్యాదులపై వేగవంతమైన, పారదర్శక చర్యలు

### అంతర్గత ఫిర్యాదుల కమిటీ పనితీరుపై సీపీ అంబర్ కిషోర్ ఝా సమీక్ష

**మంచిర్యాల 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** కార్యాలయాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) పనితీరు, విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013 (పోష్ చట్టం) నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మహిళలు ఎలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చేలా విశ్వసనీయమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలు, సభ్యులు తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఫిర్యాదులను స్వీకరించడం, నమోదు చేయడం, నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించడం, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించడం వంటి అంశాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఫిర్యాదుదారు, ప్రతివాది, సాక్షుల వివరాల గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని, విచారణలో పారదర్శకతతో పాటు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఐసీసీకి సంబంధించిన రికార్డులు, పత్రాలను సక్రమంగా నిర్వహించాలని, కార్యాలయాల్లో కమిటీ వివరాలు, ఫిర్యాదు చేసే విధానాన్ని నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని సీపీ సూచించారు. పోలీస్ సిబ్బంది, ఉద్యోగులకు పోష్ చట్టంపై నిరంతరం అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని



తెలిపారు. మహిళల గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కార్యాలయాల్లో ఎలాంటి లైంగిక వేధింపులకు తావులేని వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ఐసీసీ అధ్యక్షురాలు, సభ్యుల విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, విచారణ విధానం, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించడం, ఫిర్యాదుదారు, ప్రతివాది, సాక్షుల వివరాల గోప్యత, ఉద్యోగులకు పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ, ఐసీసీ విచారణలకు సంబంధించిన రికార్డులు, పత్రాల నిర్వహణ, నోటీసు బోర్డులపై ఐసీసీ వివరాలు, ఫిర్యాదు విధానం ప్రదర్శన తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, సీహెచ్. సంధ్య, బి. సూపరింటెండెంట్, సీపీఓ రామగుండం, బి. సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ శ్రీరాంపూర్, వి. హైమ, ఎస్ఐ, షీ టీమ్ మంచిర్యాల, ఎన్. ఒబులమ్మ, ఎస్ఐ, పీసీఆర్ రామగుండం, పి. సరిత, ఆర్ఎస్ఐ, సీఏఆర్ రామగుండం, కె. నవ్యకృష్ణ, న్యాయ సలహాదారు, భరోసా కేంద్రం పెద్దపల్లి, ఎ. శ్రీలత, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, సఖి కేంద్రం మంచిర్యాల తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతలో షీ టీమ్స్ కీలక పాత్ర



**ఆకతాయిలపై కఠిన చర్యలు..**

**12 నుంచి 18 ఏళ్ల బాలికలకు ప్రత్యేక అవగాహన**

**మంచిర్యాల , 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మహిళలు, బాలికలకు భద్రతపై భరోసా కల్పించడంతో పాటు పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించడంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మహిళలు, పిల్లల రక్షణ, భరోసా కేంద్రాల సేవలపై గురువారం కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో షీ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మహిళలు, బాలికలను వేధించే ఆకతాయిలపై నిఘా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. అందిన ఫిర్యాదులపై ఆధారాలు సేకరించి, నేరం జరిగినట్లు తేలితే ఎలాంటి ఆలస్యం చేయకుండా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు వేధింపులు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, మంచి స్పర్శ--చెడు స్పర్శ తదితర అంశాలపై పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలని, వారి భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించాలన్నారు. బాధిత మహిళలు, చిన్నారులకు తక్షణ సహాయం అందించడంతో పాటు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస, సంక్షేమ సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల పట్ల సానుభూతి, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ వారికి ధైర్యం కల్పించాలన్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు బాధితులకు నాణ్యమైన కౌన్సెలింగ్, రక్షణ, పునరావాస సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ సిబ్బంది నిజాయితీ, పారదర్శకత, నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ బాధితుల గోప్యతను కాపాడాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, షీ టీమ్ ఎస్ఐలు హైమా, ఉషారాణి, లావణ్య, షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

## ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఆడిపాడిన విద్యార్థినులు



**జన్నారం,అక్టోబర్8(ప్రజాజ్యోతి)** తెలంగాణ ఆడపడుచుల పెద్ద పండుగ బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి.కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో, గుమ్మడి, తంగేడు, బంతి పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాధాన్యతను అధ్యాపకులు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్యం సతీష్,అధ్యాపకులు కామెర రాజాం, మోహన్ సత్తన్న, శ్రావ్య, రవి, సరిత, రాజేందర్, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా ప్రజల సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకట నలో తెలిపారు.ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం ప్రతిసారీ కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుం డా,ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ డిజి టల్ వేదికను ఏర్పాటు చేసి నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ ఫిర్యాదు లను వాట్సాప్ నంబర్ 9492341947కు మెసేజ్ రూపంలో పంపవచ్చని తెలిపారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫొటోలు పంపించాలని సూచించా రు.ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును ప్రత్యేక బృందం నమోదు చేసి, వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవే క్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా ప్రజలు ఈ వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ సేవలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే ఈనంబర్‌కు పంపించాలని, అనవసరమైన లేదా తప్పుడు సందేశాలను పంపవ ద్దని సూచించారు. 9492 341947 నంబర్‌ను కేవలం వాట్సాప్ సేవల కోసం మాత్రమే వినియోగించాలని,ఈ నంబర్‌కు ఫోన్ కాల్స్ చేయరాదని జిల్లా కలెక్టర్ ప్రజల కు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి






## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

## బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళిక

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 8 ,( ప్రజాజ్యోతి )** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచి, విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందించాలని సూచించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో ప్రగతి సాధించేలా బోధన కొనసాగించాలని, విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, ఆయా అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై ఆసక్తి పెరిగేలా వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. కేవలం సిలబస్ పూర్తి చేయడానికే పరిమితం కాకుండా, విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకునేలా బోధన సాగాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు.పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులు, పోషకులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయం, ఆందోళన లేకుండా ఉపాధ్యాయులు వారికి ధైర్యం కల్పించాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా నిరంతరం మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యాబోధనతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం ఉండేలా చూడాలని తెలిపారు. సమావేశంలో పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యం, వెనుకబడిన విద్యార్థుల కోసం చేపడుతున్న ప్రత్యేక బోధన, బోర్డు పరీక్షల సన్నద్ధత తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు

ప్రజలు నేరుగా వాట్సాప్‌లో ఫిర్యాదులు చేసే అవకాశం మంత్రి పేషీ, కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక వాట్సాప్ నంబర్లు

మంత్రి జూపల్లి ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్ర త్యేక గ్రీవెన్స్ సెల్

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృ ష్ణారావు ఆదేశాలతో ప్రభు త్వ సేవలపై ఫిర్యాదులకు ఇకపై ఎక్కడికి తిరగాల్సిన అవసరం లేకుండా సరికొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. వాట్సాప్‌లో ప్రభు త్వ సేవలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించాలని మంత్రి జూపల్లి కృ ష్ణారావు కలెక్టర్లకు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలోని 4 కలెక్టరే ట్లలో ప్రజా ఫిర్యాదుల వ్యవ స్థను (ప్రత్యేక గ్రీవెన్స్ సెల్) ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారు ల దృష్టికి తీసు కెళ్లేలా వాట్సాప్ సేవలను కలెక్టర్లు అందుబాటు లోకి తెచ్చారు. హైదరాబాద్ లోని మంత్రి జూపల్లి పేషీలోనూ ఈ సేవలను వినియోగించు కోవచ్చు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు ను సంబంధిత అధికారులు పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాల కలెక్టర్ల ను ఆదేశించారు. ఫిర్యాదు లను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

వాట్సాప్ నంబర్లు

మంత్రి జూపల్లి కృష్ణారావు పేషీ: 8500689596

ఆదిలాబాద్ కలెక్టరేట్: 9492341947



నిర్మల్ కలెక్టరేట్: 8317557897

కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్: 7569986036

మంచిర్యాల కలెక్టరేట్: 9492123642

ప్రజలు ఈ వాట్సాప్ నంబర్లను వినియోగించుకుని తమ సమస్యల ను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సత్వ ర పరిష్కారం పొందాలని మంత్రి కోరారు.ఉమ్మడి జిల్లా ప్రజలు తమ ఫిర్యా దులను వాట్సాప్ నంబర్లకు మెసేజ్ రూపంలో పంపవ చ్చని కలెక్టర్లు తెలిపారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వి వరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమై న ఆధారాలు, ఫోటోలు పంపించాలని సూచించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే ముందస్తు బతకమ్మ సంబరాలు



**ఖానాపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి)** రానున్న బతుకమ్మ సంబ రాల్లో భాగంగా ముందస్తుగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బతుకమ్మ ఉత్సవం నిర్వహించారు ఈ మేరకు స్థానిక జూనియర్ కళాశాల నుండి జగన్నాథ్ చౌక్ మీదుగా డీజేతో బతుకమ్మ పాటలను పెట్టి విద్యార్థుల నృత్యాలతో సంబరంగా గోదావరి వరకు బత్కమ్మలను తీసుకొని ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం కావించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యా ప్రమాణాలను పెం పొందించేందుకు గత బీఆర్ ఎస్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగాలకు అవస రమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఆదిలాబాద్ పట్టణం లోని ఆర్ఎస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్యారామెడికల్ కళాశాల ఆధ్వ ర్యంలోని ర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పలు విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా విధానాన్ని ప్రోత్సహించా మని తెలిపారు. మెడికల్ కళాశాలలు, బీఎస్సీ నర్సింగ్ కళాశా లలు, ఇంజనీరింగ్, ప్యారా మెడికల్ విభాగాలతో పాటు ఐటీ రంగంలో అవకాశాలను పెంచే విధంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధార పడకుండా ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునేలా తమ నైపుణ్యాలను పెంపొందిం చుకోవాలని సూచించారు. కళా శాలలో అందించే శిక్షణ తరగ తులను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు పొందేదిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో యాసం నర్సింగ్ రావు, మెట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం





**ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు**

**అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఏఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు బ్లాక్ డే -- పర్ ఇండి యన్ డెమోక్రసీ" కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కీసర్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమి టీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డిసిసి సాజిద్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్చార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రె స్ కార్యాలయ ఇన్చార్జ్ గౌలి సంజీవ్ కుమార్, మాజీ ము న్సిపల్ ఫ్లోర్ బండారి సతీష్, ప్రజా ప్రతినిధులు, కార్య కర్తలు, వివిధ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ "ఓట్ చోరీ"కి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నలోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సీనియర్ నాయకులు, ఇండి యా కూటమి ఎంపీలపై జరిగిన దౌర్జన్యం, లాఠీచార్జ్ ను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మా ర్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా పారదర్శకతను నిర్ధారించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని పేర్కొన్నారు ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షం లేవనెత్తుతున్న "ఓట్ చోరీ" ఆరోపణలపై సమగ్రంగా సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపా డేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసా గిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ డిసిసి సాజిద్ ఖాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా "ఓటు హక్కును కాపాడుదాం ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షిద్దాం, రాజ్యాంగ విలువలను కాపా డుదాం" అనే సందేశాన్ని ప్ర జల్లోకి బలంగా తీసుకెళ్లామని అయన అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది, ఎన్ని కల కమిషన్‌ది అనిఅయన ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభగాం అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్, మైనారిటీ విభాగం అధ్య క్షులు సయ్యద్ షాహిద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, మున్సిప ల్ కౌన్సిలర్లు జీశాన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధా కర్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోతీరామ్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, అత్తర్ అలీ, మందాకిని, కాడే సం తోష్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ సిరాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ మేక లజితేందర్, మావల గ్రామ సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖ ర్, మామల మండల అధ్య క్షులు కుదురుపాక సురేష్, బోర చేసే విభాగం అధ్యక్షులు పొట్ట అశోక్, మావల ఎస్ ఐ విభాగం అధ్యక్షులు అక్షయ్, వార్డు ప్రెసిడెంట్లు జగదీశ్వర్ రెడ్డి, ఫాహిమ్, షౌకాత్, భూసం ప్రభాకర్, తుమ్మ ప్రకాష్,దమ్మ కీర్తి, సలీం, దిల్షాద్, అజర్, మోసిన్, రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ కమిటీనాయకులు, మండల అధ్యక్షులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు దితరులు పాల్గొన్నారు.

# కలమడుగు సబ్‌స్టేషన్‌కు 2 మెగావాట్ల సౌర విద్యుత్ అనుసంధానం ప్రారంభించిన రాజన్న



**జన్నారం,అక్టోబర్8(ప్రజాజ్యోతి)** మంచిర్యాల డివిజన్ పరిధిలోని జన్నారం మండలం కలమడుగు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను గురువారం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజన్న 11 కేవీ స్థాయిలో విజయవంతంగా సింక్రనైజ్ చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా సౌర విద్యుత్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 11 కేవీ స్థాయిలో కలమడుగు సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఇటువంటి ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని సూపరిండెంట్ ఇంజనీర్ రాజన్న తెలిపారు. కుసుమ్ పథకం ద్వారా రైతులు, ప్రైవేట్ డెవలపర్లు సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహించబడుతున్నారని, సోలార్ విద్యుత్ తో పగటి వేళల్లో విద్యుత్ అవసరాలకు తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ కైసర్, ఎం ఆర్ టి డి ఈ .రాజేశం, ఏ డి ఈ తిరుపతి, ఏ డి ఈ కమర్షియల్ మోహన్ రెడ్డి, హెచ్ టి.ఏ డి ఈ రామ్ చందర్, ఏ ఈ సాయి శృతిక్, ఎల్ ఎం వెంకటేశ్వర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల అరెస్టు పట్ల ఖానాపూర్ లో నిరసన



**ఖానాపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి)** సర్ ప్రక్రియను తప్పుపడుతూ దేశ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఖర్ గె లతో పాటు పలువురిని అరెస్టు చేసిన సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌర్రె గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథ్ చౌక్ వద్ద ధర్నా రాస్తారోకో కార్యక్రమం గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరసన చేస్తున్న వారిని నిర్దక్షిణంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమణి పలువురు నిరసన కార్యక్రమంలో ప్రసంగించారు ఇందులో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం అంకం రాజేందర్ దేవతి రాజేశ్వర్ షబ్బీర్ భాష అమానుల్లా ఖాన్ జన్నారం శంకర్ ముందు శ్రీనివాస్ వీరేశం మల్లేష్ సంతోష్ శేషాద్రి రాజేందర్ మధుర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు అరగంట పాటు రాస్తారోకో నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులను స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రాహుల్ గైక్వాడ్ సిబ్బందితోపాటు వారిని తొలగించి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించారు

## "వాన జాడేది..? రైతు గోడు వినేదెప్పుడు..?"

**--"నేరడిగొండను కరువు మండలంగా ప్రకటించి తక్షణమే నష్టపరిహారం అందించాలి:**

**--సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్"**



**నేరడిగొండ, అక్టోబర్ 08( ప్రజాజ్యోతి):**వర్షాభావ పరిస్థితులతో నేరడిగొండ మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు మండలంగా ప్రకటించాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్ చేశారు. సకాలంలో వర్షాలు కురవక ప్రధాన పంటలైన పత్తి, సోయాసాగు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల ఖర్చుల రూపంలో భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు దిగుబడులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారుల తో సంయుక్త బృందాలను ఏర్పాటు చేసి, మండలంలోని ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆయన కోరారు. బాధిత రైతులను పారదర్శకంగా గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పంట రుణాల సడలింపుతో పాటు చెరువులు, కుంటల పునరుద్ధరణ, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి దీర్ఘకాలిక సాగునీటి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## బైక్ తో వస్తుండగా రోడ్డు ప్రమాదం ఒకరు మృతి...



**బెజ్జూరు అక్టోబర్08(ప్రజాజ్యోతి):** కాగజ్ నగర్ నుండి బెజ్జూర్ కి వస్తున్న క్రమంలో సలుగుపెల్లి గ్రామ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. బైకుపై ఉన్న రేచిని గ్రామానికి చెందిన నికురి అనంతరావు, నికురి మల్లయ్య, నికురి రాజయ్య ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో నికురి అనంతరావుకు సీరియస్ గాయాలు కాగా,నికురి రాజయ్య మృతి చెందినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

## డిజిటల్ విద్యను బోధనలో భాగం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య**






**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు డిజిటల్ విద్యా విధానాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని, తరగతి గది బోధనలో సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్మల్ ఉన్నత పాఠశాల, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, శక్తి ఐటిఐ, నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలో గల అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లలో జిల్లాలోని భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ల కోసం "ది బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్" అంశంపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనకు కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ వనరులను బోధనలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యార్థులలో ఆసక్తి, అవగాహన, సృజనాత్మకత పెంపొందించ వచ్చని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తూ హై స్కూల్ విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన ఖాన్ అకాడమీను ఉపాధ్యాయులు విస్తృతంగా వినియోగించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను కేవలం శిక్షణ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, పాఠశాల స్థాయిలో నిరంతరం బోధనలో భాగం చేయాలని తెలిపారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన అభ్యసన అవకాశాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు .ఈ కార్యక్రమంలో కోర్స్ కో–ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, కోర్స్ ఇన్చార్జ్ రాజేశం, జిల్లా రిసోర్స్ పర్సన్స్ రాజన్న, అర్క కుమార్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలి

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రథాప్ సింగ్**



**ఆదిలాబాద్ టౌన్, అక్టోబర్ 8, (ప్రజా జ్యోతి)** సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ అన్నారు. బతుకమ్మ పండగ సంబరాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యా పకులు,సిబ్బంది, విద్యార్థు నులు బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యా లోనంటూ ఆడుతూ పాడారు. ఈ సంద్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్ డాక్టర్ రాణి, డాక్టర్ అనిత, కళాశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ అనూష**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో గురు వారం బతుకమ్మ సంబరాలను ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ అంటే తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ప్రకృతితో అనుబంధం, సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి ప్రాంతంలో ప్రజలు బతుక మ్మ పండుగను ఎంతో ఆనందంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జి ల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వివిధ వర్గాల ప్రజలు ఐకమత్యంతో పండుగలను జరుపుకో వడం జిల్లాకు ప్రత్యేకతను తీసుకువస్తుందని ఆమె అ న్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైన పండుగగా, మన తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే వేడుకగా నిలిచిందని తెలిపారు. విద్యార్థులు, యువత తెలంగాణ పండుగలు, సంస్కృతి, సం ప్రదాయాల విశిష్టతను తెలుసుకుని భవిష్యత్ తరాలకు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా, సంతోషంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు త దితరులు పాల్గొన్నారు.

## పనులను పరిశీలించి... సంతోషం వ్యక్తం చేసి



**లోకేశ్వరం అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)** అంకితభావంతో పనిచేసి గ్రామ అభివృద్ధి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు గురువారం రోజున మండలంలోని అబ్దుల్లాపూర్, కనకాపూర్ వాస్తాపూర్, ధర్మరా గ్రామాలలో పర్యటించి రికార్డులను పనులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సకాలంలో ఇస్తున్నందున సక్రమంగా పనులు చేయాలని ఆయన ఆదేశించారు కనకాపూర్ లో పెన్షన్ వెరిఫికేషన్ అనంతరం పలు గ్రామాలను పరిశీలించిన ఆయన పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు విబిజి రాంజీ పథకంలో పంట పొలాలకు రోడ్లు వేసుకోవాలని ఆయన సూచించారు వర్ష పరిస్థితుల దృష్ట్యా వర్షాలు లేనందున ఇంకుడు గుంతల సైతం, డ్రైన్ మరియుసోఫిట్స్ సైతం నిర్మించుకోవాలని ఆయన అన్నారు ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సోల్మన్ రాజ్ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి నాయకులు సత్యం, భోజన్న తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి పీఆర్టీయూ టీఎస్ అండ

**సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం**



**ఆదిలాబాద్ టౌన్ , అక్టోబరు 8 ( ప్రజా జ్యోతి )** ఇటీవల మృతిచెందిన ఖోగ్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు సతీష్ గుర్నులే కుటుంబానికి పీఆర్టీయూ–టీఎస్ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు లక్ష రూపాయల చెక్కును ఆయన సతీమణికి అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ–టీఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమానికి పీఆర్టీయూ–టీఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనుకోని పరిస్థితుల్లో సభ్యుల కుటుంబాలకు ఆర్థిక, నైతిక సహాయం అందించడం సంఘం బాధ్యతగా భావిస్తోందన్నారు. మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు సంక్షేమ నిధి ద్వారా సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బేల మండల అధ్యక్షుడు ఎస్. దేవరావు, ప్రధాన కార్యదర్శి నితిన్‌కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రాజు చొపడే, రాష్ట్ర కార్యదర్శి పతాని స్వామి, జిల్లా కార్యదర్శి మదన్‌మోహన్, బేల సహాయ అధ్యక్షుడు ఎన్. సంతోష్, మండల ఉపాధ్యక్షులు ఎస్. సంతోష్, ఆర్. ప్రశాంత్, మండల కార్యదర్శులు ఏ. శ్రీకాంత్, డి. హరికృష్ణ, ఖోగ్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ అధ్యక్షుడు అమరేందర్, జిల్లా కార్యదర్శి బేర ప్రశాంత్, సీనియర్ కార్యకర్త సంజయ్ దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు చ.వికాస్, అమిత్, వేణు తదితరులు పాల్గొన్నారు

## రెండు కిలోమీటర్ల దూరం నుంచి ఎడ్లబండ్లతో నీటి తరలింపు

**బోరు లేక బనార్‌గొంది గ్రామస్తుల అవస్థలు.. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పరిష్కారం లేదని ఆవేదన**



**ఆసిఫాబాద్ అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని వావుదాం గ్రామపంచాయతీ పరిధిలో లోని బనార్‌గొంది లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బోరు సౌకర్యం లేకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని కాప్రి గ్రామం నుంచి ఎడ్లబండ్లపై నీటిని తీసుకొచ్చి తాగాల్సిన దుస్థితి నెలకొందని వారు వాపోయారు. రోజూ నీటి కోసం ఎడ్లబండ్లతో వెళ్లి నీటిని తీసుకురావాల్సి వస్తోందని, దీంతో సమయం, శ్రమ వృథా అవుతున్నాయని తెలిపారు.గ్రామంలో బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్, గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవితో పాటు ప్రస్తుతం కూడా నీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో బోరు ఏర్పాటు చేసి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## కేజీబీవీ అతిథి ఉపాధ్యాయుల ఎంపికలో పారదర్శకత

**మెరిట్ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక**

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలో నిర్వహించిన అతిథి ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల బోధనా నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత, ప్రతిభ ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేపట్టాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు నిర్వహించిన బోధనను స్వయంగా పరిశీలించిన అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు.కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హత, ప్రతిభ ఉన్న అభ్యర్థులకు మాత్రమే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అతిథి ఉపాధ్యాయుల పోస్టుల కోసం దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో విద్యా భారతి సంస్థకు అవార్డు



**తాండూర్ అక్టోబర్ 08 ప్రజాజ్యోతి** హైదరాబాద్ లో జరిగిన సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026 లో తమ సంస్థ విద్యా భారతి హై స్కూల్ కు జాతీయ స్థాయిలో డైనమిక్ స్కూల్ అవార్డు లభించినట్టు పాఠశాల డైరెక్టర్ శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన అంశాలలో విభిన్నత అంశంలో పాఠశాలకు ఈ అవార్డు లభించినట్లు, బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమములో జి న్యూస్ నెట్ వర్క్ సీఈఓ అనిల్ శర్మ చేతులమీదుగా ఈ అవార్డు అందుకోవడం సంస్థ పనితీరుకు గర్వకారణమని అన్నారు అవార్డు ప్రదానంలో అకాడమిక్ డైరెక్టర్ సౌమ్య రావు కూడా పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ ఆగమారావు ఈ సందర్భంగా సంస్థ లో పనిచేస్తున్న సిబ్బంది అంకిత భావంతో చేసిన కృషితో ఈ అవార్డు వచ్చిందని, సిబ్బందిని అభినందించారు

## క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**లక్షణాలను తొలిదశలో గుర్తించి చికిత్స అందించాలి: కలెక్టర్ హరిత**

**క్షయ రహిత గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బందికి సన్మానం**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'క్షయ నిర్మూలనకు యువత సన్నద్ధం--టీబీ ముక్త్ పంచాయతీలు' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి, బాధితులకు ఆరు నెలలపాటు నిరంతర చికిత్సతో పాటు పోషకాహారం అందిస్తే క్షయను నియంత్రించవచ్చన్నారు. యువత, వైద్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ పాలకవర్గాలు తమ పరిధిలో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. లక్షణాలు ఉన్న వారి సమాచారాన్ని వైద్య సిబ్బందికి చేరవేసి సకాలంలో చికిత్స అందేలా చూడాలని కోరారు.అనంతరం క్షయ రహిత గ్రామపంచాయతీలుగా ఎంపికైన ఆసిఫాబాద్ మండలం గోవిందపూర్, బెజ్జూర్ మండలం పోతేపల్లి, జైనూర్ మండలం పవార్‌గూడ, కెరమెరి మండలం సాంగ్వి, సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్, వాంకిడి మండలం దాబా గ్రామాల సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకటల్, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, వైద్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**జన్నారం,అక్టోబర్8(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని మొర్రిగూడ వాగు నుండి గురువారం రోజున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్టు రేంజ్ అధికారి బాబా ఖాదర్ వలీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రిగూడ గ్రామానికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తి మొర్రిగూడ వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమయంలో పట్టుకొని కేసు నమోదు చేసి ట్రాక్టర్ ను ఇందనపెల్లి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా చేసిన నిలువ ఉంచిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడును హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సెక్షన్, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**పారదర్శకతకు పెద్దపీట వేయాలి: కలెక్టర్ హరిత**





**ఆసిఫాబాద్, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** భూముల రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తే భవిష్యత్‌లో భూ హద్దుల వివాదాలకు చెక్ పెట్టడంతో పాటు రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గురువారం భూముల రీ సర్వేలో తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి రీ సర్వే విధానంపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్దార్ నుంచి క్షేత్రస్థాయి రెవెన్యూ ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరూ రీ సర్వే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డీజీపీఎస్ రోవర్స్ ద్వారా భూముల కొలతలు చేపట్టే విధానాన్ని సిబ్బంది పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు అవగాహన అవసరమన్నారు.ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూముల సర్వేను కూడా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వేలో సేకరించిన వివరాలను కచ్చితత్వంతో నమోదు చేసి రెవెన్యూ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భూ కొలతల అధికారి వినయ్, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు, జీపీఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్--కనర్‌గాం రహదారి నిర్మించాలి

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఉప సర్పంచ్‌ల ఫోరం వినతి



**ఆసిఫాబాద్, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ నుంచి గుండి మీదుగా కనర్‌గాం వరకు డాంబర్ రోడ్డు నిర్మించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఉప సర్పంచ్‌ల ఫోరం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణం జరిగితే గుండి, కనర్‌గాం పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, విద్యార్థులు, రైతులు, వాహనదారులకు ప్రయోజనం కలుగుతుందని వారు వివరించారు. ఉప సర్పంచ్‌ల ఫోరం కుమురం భీం జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం జీవన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను కలిసి రహదారి సమస్యను వివరించారు. రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సామెల ఉప సర్పంచ్, కుమురం భీం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రేపాక నాగభూషణం, సవతి సర్పంచ్ భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకి బీజేపీ నేతల ఘన సన్మానం



**ఆసిఫాబాద్ అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజును బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కెరమెరి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భానోత్ వెంకట్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా విజయ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సందీప్, మండల అధ్యక్షుడు షెడ్మకి తుకారాం, సీనియర్ నాయకులు రాజు నాయక్, రాథోడ్ లాల్‌సింగ్, పవర్ రవీందర్, రాథోడ్ ఆత్మారామ్, అలుగొట్టు నవీన్‌కుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### మాజీ మున్సిపల్ చైర్మన్ల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు



**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై మాజీ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, మాజీ కౌన్సిలర్ సంజీవ్‌లు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జలీల్, 31వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అర్కాల హేమలత అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తిన్నింటి వాసాలు లెక్కించడంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య సిద్ధహస్తుడని జలీల్ ఆరోపించారు. ఆయన హయాంలో భూకబ్జాలు, బ్లాక్‌మెయిలింగ్, వసూళ్ల దందా, గ్రూపు తగాదాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర లేదా అని ప్రశ్నించారు. 2009 సంవత్సరంలో పేదల కోసం 210 ప్లాట్లు కేటాయించిన సమయంలో ఒక్కో ప్లాట్‌కు రూ.5 వేల చొప్పున డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఉప్పలయ్య ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల కోసం ఉద్దేశించిన స్థలాల విషయంలో సైతం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉప్పలయ్య, ఇప్పుడు ఇతరులపై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ స్వార్థంతో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మాజీ కౌన్సిలర్ సంజీవ్, నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణులకు రాజకీయంగా అవకాశాలు కల్పించి ప్రోత్సహించింది ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అనే విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజల్లో ఆదరణ లేని నాయకులుగా మిగిలిపోయిన వారు కొత్త కుంపటి పెట్టి రాజకీయంగా ఏదో సాధిస్తామని భావిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై వ్యక్తిగతంగా, అనుచితంగా మాట్లాడటం మానుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తగిన రీతిలో స్పందిస్తాయని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సంకల్ప్ స్కూల్లో చిన్నారుల ముందస్తు బతుకమ్మ వేడుక



**ఖానాపూర్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి )** ప్రతి ఏటా జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా పాఠశాల పిల్లలకు దసరా సెలవులు ఉన్నందున ముందస్తుగానే నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని సంకల్ప్ స్కూల్లో గురువారం చిన్నారి విద్యార్థినులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు ని సొంత రబ్బంగా తీరక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను అలంకరించి సంప్రదాయ సిద్ధంగా బతుకమ్మ పాటలను ఆలకించి చిన్నారులతో పాటు పేరెంట్స్ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో స్కూల్ ప్రాంగణం బతుకమ్మ ఆటపాటల సందడితో కలకలలాడింది. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ముందు తరాలకు తెలిసే విధంగా చిన్నారులకు ఇప్పటినుండి అలవర్చడం జరుగుతుందని ఈ మేరకు బతుకమ్మ పండుగ విశిష్టత తెలియజేశారు

## వాట్సాప్ ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)**ప్రజల సమస్యలను సత్వర మే పరిష్కరించడంతో పా టు ప్రభుత్వ సేవలను మ రింత చేరువ చేసేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సంబంధిత శాఖలకు వెంట నే పంపించి, వాటిపై సమగ్రంగా విచారణ జరిపి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదు పై తీసుకున్న చర్యలను నమోదు చేయడంతో పాటు ఫిర్యాదు దారుడికి సమాచారం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గురువారం క్యాంపు కార్యా లయంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహ ణ, ఫిర్యాదుల స్వీకరణ, విచారణ, పరిష్కారం, జవాబుదారితనం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఫిర్యాదు ల పరిష్కారంలో జాప్యం జరిగితే అందుకు గల కారణాలను పరిశీ లించి, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా గ్రీవెన్స్ సెల్ నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాల ని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదన పు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, ఐటీడీఏ పీవో మంద మకరందు, డీఆర్వో స్రవంతి, డీ పీఆర్వో విష్ణువర్ధన్, పర్యవే క్షకులు నలంద ప్రియ, ఈ డీ ఎంరవి, సాంకేతిక సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో

**ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఎజెండా పెడితే సహించేది లేదు**

**కార్మికుల పీఎఫ్ డబ్బులు వెంటనే జమ చేయాలి.. ప్రతిపక్ష ముగ్గురు కార్పొరేటర్లు**

**బైపాస్‌లో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి.. జనరల్ ఫండ్‌ను ప్రజల అవసరాలకే వినియోగించాలి**



**మంచిర్యాల, 8, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ముగ్గురు ప్రతిపక్ష కార్పొరేటర్లు మంచిర్యాల కార్పొరేషన్ నాలుగో డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ , 50 డివిజన్ కార్పొరేటర్ పెట్టం స్వరూప లక్ష్మణ్ , 50 డివిజన్ కార్పొరేటర్ ఎం.డి సత్తార్ లు పై విషయాలపై కార్పొరేటర్లు అడగడం జరిగింది. గురువారం జరిగిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. సమావేశానికి ముందు కార్పొరేషన్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. మేదరివాడ నుంచి లక్ష్మీ టాకీస్ బైపాస్ మీదుగా ఎన్‌హెచ్ వద్ద ఉన్న బైపాస్ ప్రాంతంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని, బైపాస్ డివైడర్ మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని కోరారు. ఇదే సమయంలో కార్పొరేషన్ కార్మికుల పీఎఫ్ డబ్బుల విషయంలో గత కౌన్సిల్ సమావేశంలోనే డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు జమ చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్మికుల ఖాతాల్లో పీఎఫ్ డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చెప్పులు, జాకెట్లు అందించేందుకు రూ.4.25 లక్షలు కేటాయించినందున నాణ్యమైన చెప్పులు, జాకెట్లు మాత్రమే కార్మికులకు అందించాలని కోరారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు తమ పరిధిలోని కొన్ని ఇళ్లకు అధికంగా ఇంటి పన్నులు విధిస్తున్న అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలపై అధిక పన్నుల భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దసరా పండుగ నిర్వహణ కోసం రూ.20 లక్షలు కేటాయించిన నేపథ్యంలో మొత్తం నిధులను ఒకే విధంగా ఖర్చు చేయకుండా ప్రతి డివిజన్‌కు రూ.లక్ష చొప్పున కేటాయించి ఆయా డివిజన్లలో ప్రజలకు అవసరమైన విధంగా వినియోగించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, వాటి కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేషన్ జనరల్ ఫండ్‌ను కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, అవసరం లేని పనులకు అధికంగా నిధులు కేటాయించి ఖర్చులు చూపించడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కార్పొరేటర్లు స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసరమైన ప్రాంతాల్లోనే జనరల్ ఫండ్ వినియోగించాలని, ఈ విషయంలో పూర్తి బాధ్యత కమిషనర్, మేయర్‌లదేనని పేర్కొన్నారు. అదేవిధంగా నగరంలోని ట్రాఫిక్ సిగ్నళ్ల సమస్య, చెత్త సేకరణకు అవసరమైన చెత్త బండ్ల సమస్య, డంప్‌యార్డు సమస్య తదితర అంశాలను కూడా కౌన్సిల్‌లో ప్రస్తావించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమస్యలను పరిష్కరించకుండా, వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఎజెండాలో ఇతర అంశాలను పెట్టడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కార్పొరేటర్లు తెలిపారు. ప్రజల అవసరాలకు సంబంధించిన అంశాలను ఎజెండాలో చేర్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటే తాము పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ నిధులు ప్రజల కోసం, ప్రజల అవసరాల మేరకే ఖర్చు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

**నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నిరసన**

**ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి**

**కేంద్ర ప్రభుత్వంపై సుగుణక్క విమర్శలుఉ**

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**

**ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ డిమాండ్**





**ఆసిఫాబాద్, అక్టోబరు 8 ప్రజా జ్యోతి** ఓటు హక్కు పరిరక్షణకు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు చర్యలు చేపట్టాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కోరారు. ఈ అంశాలపై జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన వ్యక్తుల ఓటు హక్కు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న సందేహాలపై ప్రభుత్వం, ఎన్నికల వ్యవస్థ స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా పారదర్శక చర్యలు చేపట్టాలని సూచించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో తగిన స్థాయిలో వ్యవహరించడం లేదని సుగుణక్క విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు వెళ్లిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్న ఘటనను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.'ఓటు చోరీని ఆపాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అని కాంగ్రెస్ నాయకులు నినదించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సుగుణక్క పేర్కొన్నారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపై కాంగ్రెస్ తన కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తారిక్, మండల అధ్యక్షుడు మురళి, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, వాంకిడి మండల అధ్యక్షుడు మంగాజి, కెరమెరి మండల అధ్యక్షుడు సుజాహిద్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల జక్కయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ గడ్డల సత్తయ్య, సీనియర్ నాయకులు చిట్ల నారాయణ, బాలు యాదవ్, మహమ్మద్, విశ్వనాథ్, శంకర్, పేంటు, మహిళా నాయకురాలు కళావతి, యువజన కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, ఎలాగల, నైతంబాను తదితరులు పాల్గొన్నారు.

# మీడియా రంగానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం







**వాస్తవ, విశ్వసనీయ సమాచారమే జర్నలిస్టుల లక్ష్యం కావాలి**

**తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృ ష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ, విశ్వసనీయ సమా చారాన్ని అందించడంలో మీ డియా కీలక పాత్ర పోషిస్తుం దని తెలంగాణ రాష్ట్ర మీడి యా అకాడమీ చైర్మన్ శ్రీని వాస్ రెడ్డి అన్నారు. మారు తున్న కాలానికి అనుగుణం గా మీడియా రంగంలో సాం కేతిక పరిజ్ఞానం వేగంగా అ భివృద్ధి చెందుతున్న నేప థ్యం లో జర్నలిస్టులు నూత న సాంకేతికతను అందిపు చ్చుకుని వృత్తి నైపుణ్యాల ను ఎప్పటికప్పుడు మెరు గుపరుచుకోవాలని సూచిం చారు.తెలంగాణ రాష్ట్ర మీ డియా అకాడమీ ఆధ్వర్యం లో స్థానిక టీటీడీసీ హాల్లో విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్య క్రమాన్ని గురువారం ఆయ న ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా చైర్మెన్ మాట్లాడు తూ, ప్రింట్, ఎలక్ట్రానిక్, డి జిటల్, సోషల్ మీడియా రంగాల్లో విప్లవాత్మక మా ర్పులు చోటుచేసుకుంటు న్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని సమర్థవంతంగా విని యోగించుకోవాల్సిన అవ సరం ఉందన్నారు. వార్తల సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, రచన, ప్రసారం వంటి ప్రతి దశలో జర్నలి స్టులు అప్రమత్తంగా వ్యవ హరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా స మాచారం క్షణాల్లో విస్తరిస్తు న్న ప్రస్తుత పరిస్థితుల్లో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా జాగ్ర త్త వహించాలన్నారు. వార్త ను వేగంగా అందించడం కంటే, వాస్తవాలను నిర్ధారిం చి బాధ్యతాయుతంగా ప్రజ లకు అందించడం ముఖ్య మని స్పష్టం చేశారు. తప్పు డు వార్తలు, అసత్య ప్రచా రాలకు తావులేకుండా ప్రజ లకు సరైన సమాచారాన్ని అందించడమే పాత్రికేయుల ప్రధాన బాధ్యతగా ఉండాల ని అన్నారు. ప్రజాస్వామ్యం లో మీడియా నాలుగో స్థం భంగా ప్రజల తరఫున గొం తుకగా నిలుస్తోందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రజలకు, ప్ర భుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల ను వెలుగులోకి తీసుకురా వడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ము ఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స మస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సే వల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావ డంలో స్థానిక విలేకరుల పా త్ర అభినందనీయమ న్నా రు. వార్తలో వేగం కంటే వా స్తవికత, విశ్వసనీయత, బా ధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల ని అన్నారు. మారుతున్న మీడియా అవసరాలకు అ నుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ, మార్గదర్శకత్వం అం దించేందుకు తెలంగాణ రా ష్ట్ర మీడియా అకాడమీ ని రంతరం కృషి చేస్తోందని తె లిపారు. జర్నలిస్టులు ఎదు ర్కొంటున్న సమస్యలను ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్ల డం తో పాటు, వాటి పరిష్కారా నికి అకాడమీ తరఫున అవ సరమైన చర్యలు తీసుకుం టామని చైర్మెన్ తెలిపారు. రెండు రోజుల శిక్షణలో అ నుభవజ్ఞులైన జర్నలిస్టులు, నిపుణులు వివిధ అంశాల పై అవగాహన కల్పించను న్నారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొ త్త విషయాలను నేర్చుకోవ డంతో పాటు వృత్తి నైపు ణ్యాలను మరింత పెంపొం దించుకోవాలని సూచించా రు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడు తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ లో సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలి స్టుల పాత్ర ఎంతో ప్రాధాన్య మైనదని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరును తెలియ జేయడంలో మీడియా కీల కంగా వ్యవహరిస్తోంద న్నా రు. వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను అంది స్తూ సమాజ అభివృద్ధికి జ ర్నలిస్టులు తమ వంతు స హకారం అందించాలని కో రారు.రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వార్తా సేకర ణలో నూతన పద్ధతులు, వార్తల వాస్తవ నిర్ధారణ, డి జిటల్ మీడియా, సోషల్ మీడియా వినియోగం, పాత్రి కేయ నైతిక విలువలు, ఆ ధునిక సాంకేతిక పరిజ్ఞానం, జర్నలిజంలో ఎదురవుతు న్న సవాళ్లు తదితర అంశా లపై నిపుణులు విలేకరుల కు అవగాహన కల్పించను న్నారు.ఈ కార్యక్రమంలో తె లంగాణ రాష్ట్ర మీడియా అ కాడమీ కార్యదర్శి నాగుల పల్లి వేంకటేశ్వరరావు, ఆర్టీ ఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, డీపీఆర్వో విష్ణు వర్ధన్, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దే వేందర్, బేత రమేష్, వినో ద్, సురేష్, సుభాష్, కిరణ్ తదితరులతో పాటు పట్ట ణ, గ్రామీణ ప్రాంతాలకు చెం దిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డి జిటల్ మీడియా ప్రతినిధు లు తదితరులు పాల్గొన్నా రు.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలి







**ప్రజాప్రతినిధులను భాగ స్వామ్యం చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశం**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో వేగం పెంచాలని, రాబోయే దసరా పండుగలోపు అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రొసీడింగ్స్ తో పాటు మార్కవుట్లు పూర్తి చేసి అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సర్వేలు, ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియపై ఆయన సం బంధిత శాఖల అధికారు లు, ఎంపీడీవోలు, మున్సి పల్ ఈఈలు ప్రత్యేకాధికా రులతో ఉన్నత స్థాయి సమీ క్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీ డింగ్స్ పత్రాలు అందజేసేట ప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోటోకాల్ ఇష్యూలు తలెత్త కుండా చూడాలని, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్ర తి నిధులను ఈ కార్యక్రమా లలో విధిగా భాగస్వామ్యం చేయాలని తేల్చిచెప్పారు. కేటాయించిన కోటా ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇం దిరమ్మ ఇళ్లు అందాలని, ఇ ప్పటివరకు రాని వాటిని వెం టనే పరిశీలించి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపాలిటీ, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, ఆయా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్ష ణమే క్లియర్ చేయాలని, సి రికొండలో మిగిలిన 29 ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగ వంతం చేయాలని సూచిం చారు. డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక అధికారు లతో కొన్ని రోజుల పాటు క్షేత్రస్థాయిలో కూర్చుని స మస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చిన తర్వాత వాటిని మ ళ్లీ వెనక్కి తీసుకోవడం గా నీ, జాప్యం చేయడం గానీ జరగకూడదని హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీ స భ్యులను సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తూ, పారదర్శకతతో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల మం జూరు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రూ, ఎస్. రాజేశ్వర్, సబ్ కలెక్టర్ ప్రణ య్ కుమార్, ఆర్డీఓ జగదీ శ్వర్ రావు, భూ సర్వే కొల తల శాఖ ఏడి ప్రభాకర్, హౌసింగ్ పీడీ శంకర్, హౌ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

# జిల్లాలో ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయానికి పకడ్బందీ చర్యలు





జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, భూముల రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రెవె న్యూ, అటవీ, గృహ నిర్మాణ శాఖల మధ్య సమన్వయం పకడ్బందీగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారుల ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మం దిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ హౌసింగ్ ఇంజనీర్లు, తహశీల్దార్లు, అటవీ శాఖ అధికారుల తో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి ఆదే శాలు జారీ చేశారు. ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, జిల్లాలో క్యాస్ట్రల్, నాన్–క్యాస్ట్రల్ రీ–సర్వేలను వే గవంతం చేయాలని, అటవీ ప్రాంతాల్లోని గ్రామాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అటవీ శాఖ అధికారులతో పూర్తి సమన్వయం చేసుకొని సంయుక్తంగా పర్యవేక్షించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా ఫారెస్ట్ ప్రాంతాల్లో లభించేనాణ్య మైన ఇసుకను నిబంధనల ప్రకారం వినియోగించుకునేలా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ ('మన ఇసుక మన వాహనం' – ఎంటిఎస్) ద్వారానే పూర్తి గా ఇసుక కేటాయింపులు జరు గుతున్నాయని వెల్లడించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోర్ ఏరియాలలో పెండింగ్‌లో ఉన్న 533 ఇళ్ల ని ర్మాణాలు, బఫర్ జోన్ సమ స్యలు, హబిటేషన్ రైట్స్ అంశాలపై చర్చించి, అవసరమైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నత స్థాయికిని వేదిస్తామని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలు,రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారులు పరస్పర సహకారంతో పని చేసి లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందేలా క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్షస మావేశంలో ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలె క్టర్ ప్రణయ్ కుమార్, ఇం చార్జి జిల్లా అటవీ శాఖ అధి కారి సుశాంత్ సుఖదేవ్ బో బడే, అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రా, ఆర్డీఓ జగదీశ్వ ర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, హౌసింగ్ పీడీ శంకర్, ఎఫ్డిఓ లు ప్రథమేష్, అరవింద్, ఏవో వర్ణ, రెవెన్యూ, ఫారెస్ట్, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

# వెట్టిచాకిరీ రహిత సమాజమే లక్ష్యంగా 'స్వేచ్ఛా రథం' ప్రారంభం





జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణకు సంబంధించిన అవగాహనను రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపే తం చేయడమే లక్ష్యంగా స్వేచ్ఛా రథాన్ని ప్రారంభించి అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో 'స్వేచ్ఛా రథాన్ని' జిల్లా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమి షనర్ ఆఫ్ లేబర్ ఈ.ము త్యం రెడ్డి వెట్టిచాకిరి నుండి విముక్తి అంశంపై ప్రతిజ్ఞ చే యించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాం డెడ్ లేబర్ అబాలిషన్ చట్టం పాతదైనప్పటికీ, ఇంకా కొన్ని ప్రాంతాల్లో వెట్టిచాకిరీ ఘటనలు వెలుగుచూస్తు న్నాయని, ప్రత్యేకించి ఆపరే షన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ తరహాలోనే బాండెడ్ చైల్డ్/సైడ్ లేబర్ విముక్తి కో సం ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. క్షేత్రస్థాయిలో ముఖ్యంగా ఇటుక బట్టీలు, స్లమ్స్, మర్జ్ ఏరియాలు, బోథ్, ఉట్నూరు వంటి పెద్ద టౌన్‌లలోని కూలీల పనితీరు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనలను తెలియజేయ డానికి, సకాలంలో ప్రభుత్వ జోక్యాన్ని కోరేందుకు ప్రత్యే కంగా టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ -- 080–6943 4343 అందుబాటులో ఉందని తెలిపారు. రెస్క్యూతో పాటు బాధితుల పునరావా సం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నామని,రెస్క్యూ చేసిన ప్రాంతాల్లో ఫీడ్‌బ్యాక్ ఎలా ఉందనేది ఎప్పటిక ప్పుడు తెలియజేయాలని, క్రిమినల్ సెలెక్షన్, పారా లీగల్ వాలంటీర్ల సేవలను సద్వి నియోగం చేసుకోవాలనిసూచించారు. ప్రతి ఒక్కరూ గౌర వప్రదంగా, ఎలాంటి దోపిడీకి గురికాకుండా స్వేచ్ఛగా పనిచేసేలా మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఐటీడీఏ పీవో మంద మకరంద్, చైల్డ్ ప్రొటె క్షన్ ఆఫీసర్ స్వామి, ఏసీ ఎల్ వినోద్, జేఏ శంకర్ గుప్తా, ఎస్. తిరుపతి, డీసీఆర్బీ ఏహెచ్‌టీయూ అధికారి హకీ మ్, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు అశోక్, గంగారాం, చంద్ర కాంత్, రమేష్, సంగీత, వివిధ శాఖల అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు తది తరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ సర్వసభ్య సమావేశం

చైర్పర్సన్ అంకం మౌనిక

**ఖానాపూర్ అక్టోబర్ 8( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణ అభివృద్ధి కోసం చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్‌అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది ప్రస్తుతం ఏలిన దృశ్య రాబోయే కాలంలో నీటి సమస్య రాకుండ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని,ప్రస్తుతం ఇంటింటికి నల్ల కనెక్షన్ ఇవ్వడంలో అమృత్ భగీరథ వాళ్ళ నిర్లక్ష్యం చేస్తున్నారని అధికారులతో ఆరాతీ శారు ఇప్పటివరకు జరిగిన పనుల వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు వివిధ వార్డులలో సిసి రోడ్లు డ్రైనేజీలను పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు రాబోయే దసరా బతుకమ్మ పండగలకు కావలసిన వీధిదీపాలను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు పట్టణంలో జరిగే అక్రమ నిర్మాణాలను రోడ్డుకు ఇరువైపుల ఉన్న షెడ్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు సమావేశంలో వైస్ చైర్మన్, సోయాబ్ హుస్సేన్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భూముల రీ-సర్వే ప్రక్రియ ను వేగవంతం చేయాలి





**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** జిల్లాలో అత్యంత ప్రతిష్టా త్మకంగా కొనసాగుతున్న సమగ్ర భూముల రీ-సర్వే ప్రక్రియను మరింత వేగవం తం చేయాలని, నిర్దేశిత ల క్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో వివిధ మండలాల్లో సర్వే పురోగతి, లైసెన్స్ స ర్వేయర్ల పనితీరుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి కీలక దిశానిర్దేశం చే శారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే అక్టోబర్ 20 తేదీ లోపు మ రిన్ని రోవర్లు రానున్నాయని, వీటిని ప్రతి మండలానికి రెండు చొప్పున కేటాయించి స ర్వే వేగాన్ని మరింత పెంచు తామని తెలిపారు. లక్ష్మీపూ ర్, నేరెడిగొండ తదితర గ్రామాల్లో నోటీసులు తక్షణమే జారీ చేసి అభ్యంతరాల స్వీ కరణ ప్రక్రియను ముగించా లని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో రెవెన్యూ ఆఫీ సర్, లైసెన్స్ సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్ లేదా గ్రామ పంచాయతీ కార్యదర్శి తో కూడిన రెండు ప్రత్యేక బృందాలను క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, కాలువ లు, జలవనరుల డిమార్కే షన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూ ర్తి చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి తాము చేసిన సర్వే పనికి సంబం ధించిన నివేదికను తహసీ ల్దార్లు, మండల సర్వేయర్లు, ఏడీ సర్వే ఆఫీసుకు విధిగా సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంట నే సంబంధిత ఫైల్స్ తయారీ పూర్తి చేసి తహసీల్దార్ల ధృ వీకరణతో కేంద్ర సర్వే ఆఫీ సుకు పంపాలని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చ రించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రా, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, హౌసిం గ్ పీడీ శంకర్, హౌసింగ్, స ర్వేయర్లు, ఇతర అధికారు లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి









**రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా**

**కేజీబీవీ జూనియర్ కళాశా ల ఆకస్మిక తనిఖీ**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వ సతులు, పౌష్టికాహారం అం దేలా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ప్రిన్సి పల్ సెక్రెటరీ యోగితా రాణా ఆదేశించారు. ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలోని సం జయ్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజీబీవీ) జూనియర్ కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలి సిఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తరగతి గదులు, వసతి గృహం, వంటగది, భోజన ప్రదేశం, పరిసరాలను పరిశీలించి వి ద్యార్థినులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబో ధన, వసతి, భోజనం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం విద్యార్థినులతో నే రుగా మాట్లాడి వారి చదువు, భోజనం, వసతి సదు పాయాలు, ఎదుర్కొంటున్న సమస్యల పై ఆరా తీశారు.విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని యోగితా రాణాసూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి ధైర్యం గా తీసుకురావాలని అన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యా ర్థినులతో కలిసి భోజనం చేసిన ఆమె, భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు. ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటగది భోజన ప్రదేశం, పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, ఆహారం తయారీ, నిల్వ, వడ్డింపులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. విద్యార్థి నుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించా రు.ఈ కార్యక్ర మంలో ఐటీడీఏ పీవో మంద మకరంద్, విద్యాశాఖ అధికారి మాధవి, కళాశాల ప్రిన్సిపల్ దీప్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భాజపా మండల అధ్యక్షుడిని పరామర్శించిన - ఎంపీ గోడం నగేష్

**నేరడిగొండ, అక్టోబరు 08 (ప్రజాజ్యోతి):**ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న భారతీయ జనతా పార్టీ నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆకుల రాజశేఖర్‌ను గురువారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు.మండల కేంద్రంలోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన ఎంపీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించి అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె శంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపల్లి గంగాధర్, పార్టీ నాయకులు రమేష్ జాదవ్, వెంకటేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

## ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద కుటుంబాలకు భరోసా: ఆత్రం సుగుణ

**ఆసిఫాబాద్ అక్టోబర్ 8 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్:** మండలంలోని అంకుశాపూర్ గ్రామపంచాయతీ పరిధి రవిచంద్ర కాలనీలో పస్తం పూజ ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ముఖ్య అతిథిగా హాజరై స్లాబ్ నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమన్నారు. సొంత ఇల్లు పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసాను కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ టేకం గంగారం, పంచాయతీ కార్యదర్శి కవిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి, జిల్లా



జనరల్ సెక్రటరీ దుర్గం రాజేశ్వర్, మండల జనరల్ సెక్రటరీ బాలమల్లు, వార్డు సభ్యులు హస్తం సంపత్, సమ్మయ్య, హస్తం అంజన్న, బావునే నాందేవ్, బండి రవి, టేకి నాగేష్, తిరుమల, కవిత, పోచయ్య, హస్తం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డి3 కాలువ పనులు పూర్తి చేయాలి

**మిగిలిన 6 కి.మీ.కు నిధులు మంజూరు చేయాలి**

**ఈఈ శ్రీనివాస్‌కు చోర్పల్లి రైతుల వినతి**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** సాగునీటి కోసం ఎదురుచూస్తున్న చోర్పల్లి రైతులకు డి3 కాలువే ఆధారం. అయితే కాలువ పూడికతీత పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. చోర్పల్లి వరకు మిగిలిన 6 కిలోమీటర్ల పూడికతీత పనులకు నిధులు మంజూరు చేసి త్వరగా పూర్తి చేయాలని కోరారు. దచోర్పల్లి ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిట్ల నారాయణ ఆధ్వర్యంలో రైతులు గురువారం నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఆడ ప్రాజెక్టు డి3 కాలువ పూడికతీతకు గతంలో సుమారు 12 కి.మీ. మేర పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామం వద్ద 12వ కిలోమీటర్ ప్రాంతంలో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. చోర్పల్లి గ్రామపంచాయతీ పరిధి వరకు సాగునీరు సక్రమంగా చేరాలంటే మరో 6 కి.మీ. మేర



పూడికతీత పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని, దీంతో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిగిలిన పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పనులు పూర్తయితే చోర్పల్లి పరిధిలో సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు మిట్ట లచన్న, మిట్ట రాజన్న, నారా ఆశన్న, సైధం మహేష్, సాయి శైలం, మిట్ట చంద్రశేఖర్, గజ్జల రాజేష్, మిట్టె పోశన్న, టకిరె పాలక్‌రావు, గొత్రే గురుమూర్తి, మిట్ట వెంకటేష్, పెద్దపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం హాస్పిటల్ తరలింపు

**అక్టోబర్ 8 సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని బెజ్జుర్ మండలం రేచిని గ్రామానికి చెందిన ఆనందరావు, మల్లు మేర,రాజయ్య నీకోడే ద్విచక్ర వాహనంతో కంటి అద్దాల కోసం బెల్లంపల్లి పట్టణానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సలుగుపల్లి పల్లె ప్రకృతి వనం మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి క్రింద పడిపోగా తీవ్ర గాయాలతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మృతి చెందాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. బైక్ ప్రమాదంలోమృతి చెందిన రాజయ్య కుమారుడు శంకర్ తెలిపారు. ఎస్సై రమేష్ ఘటన స్థలానికి చేరుకొని రేచిని గ్రామస్తులు శంకర్ ద్వారా వివరాలు సేకరించి క్షత గాత్రులను సిర్పూర్ కాగజ్నగర్ ప్రభుత్వ హస్పిటల్ కు తరలించారు. మూలమాలుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక తీవ్ర ప్రమాదాలు పొంచిఉన్నాయని, ఇప్పటికే సలుగుపల్లి పల్లె పకృతి వనం మూలమాలువు వద్ద, ఆక్సిడెంట్‌లు జరిగయని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే ప్రధాన రహదారులు మూలమలు పుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయాలనీ కోరారు.



## గంగిరెద్దుల వారికి ఆంబోతును విరాళంగా అందించిన ఉప సర్పంచ్ గంగారెడ్డి



**లక్ష్మణ చాంద, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)** మండలంలోని చామన పల్లి గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ ఏలేటి గంగారెడ్డి గురువారం రోజున సంత ఆంబోతును గంగిరెద్దుల జాతి వారికి విరాళంగా అందించాడు. ఆంబోతు విలువ సుమారు 15 వేల రూపాయల వరకు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ పాల్గొన్నారు.

## సోనాల మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడి ఎంపిక



**సోనాల, అక్టోబర్ 08 ( ప్రజా జ్యోతి ):** సోనాల మండల మైనార్టీ సెల్ నూతన అధ్యక్షుడిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమానికి కృషి చేసిన షేక్ ఇబ్రహీంకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ ముఖ్య నాయకులకు, మండల కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోని ఎస్సై, కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు "రెండు నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ" ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలి పారు. "ఇంటర్, డిగ్రీ పాసైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆఫ్ లైన్ దరఖా స్తులను ఆదిలాబాద్ లోని ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రంలో అందజేయాలని "సూచించారు. ఆఫ్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి ఎస్సెస్సి, ఇంటర్, డిగ్రీ మెమోలు కుల ధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము నివాస ధృవీకరణ, క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ తో 2 ఫోటోలు జతచేసి ఇవ్వాలని, రెండు నెలల హాస్టల్ సౌకర్యంతో పాటు కొంతమందికి బుక్స్ ఇవ్వబడతాయని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం 949414941 6, 9398784 343,ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# పోలీసుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**మేడిగూడలో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం 200 మంది గ్రామస్తులు, విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు**

**న్యూరో, గైనకాలజీ, డెంటల్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ నిపుణులచే వైద్య పరీ క్షలు కాటరాక్ట్ సమస్య ఉన్నవారికి ఉచిత కంటి వైద్య చికిత్సకు ఏర్పాట్లు**

**రోడ్డు భద్రత, మహిళల భద్రత, సీసీటీవీ కెమెరాలపై అవగాహన కల్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్**







**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 8,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలం మేడిగూడ గ్రా మంలో ప్రజలకు వైద్య సేవ లను మరింత చేరువ చేయ డంతో పాటు పోలీసు-- ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయా లనే ఉద్దేశంతో జిల్లా పోలీ సుల ఆధ్వర్యంలో “పోలీసులు మీకోసం” కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ ఐపీఎస్ ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. గ్రామ ప్రజ లు ఆదివాసీ సంప్రదాయాలతో ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ వైద్యులు, పాఠశాల విద్యార్థుల చే వైద్య శిబిరాన్ని ప్రారంభించి, నిపుణులైన వైద్యులచే గ్రా మస్తులకు అందుతున్న వై ద్య సేవలను పరిశీలించా రు. న్యూరో ఫిజీషియన్, గైనకాలజీ, డెంటల్, పీడి యాట్రిక్స్, ఆప్తమాలజీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు సుమారు 200 మంది గ్రామస్తులు, విద్యార్థుల కు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు కు ఉన్నత చదువులు ఎంతో ముఖ్యమని, విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ పౌరులని, విద్య ద్వారా సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎద గాలని ఆకాంక్షించారు. ఆరో గ్య సమస్యలు ఎదురైనప్పు డు అర్హత కలిగిన ప్రభుత్వ లేదా ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని, నకిలీబా బాలను నమ్మి ప్రజలు మోస పోవద్దని ఎస్పీ సూచించారు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమంగా డబ్బులు వసూలు చేసే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. వైద్య శిబిరంలో భాగంగా కాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. అవసరమైన వారికి వాహన సౌకర్యం కల్పించి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అనంతరం తిరిగి గ్రామానికి చేర్చే విధంగా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. గంజాయి, ఇతర మాద కద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వ్యసనానికి గురైన వారికి డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందిం చేందుకు సహకారం అంది స్తామని తెలిపారు. మహా రాష్ట్ర సరిహద్దుకు సమీ పంలో ఉన్న గ్రామాల ప్రజలు త మ ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంలో సీసీటీవీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేట ప్పుడు హెల్మెట్ తప్పనిసరి గా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుం బ సభ్యులు హెల్మెట్ ధరించే లా ప్రోత్సహించాలని ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీ ఐ జి. శ్రావణ్, ఎస్సై పి. గౌతమ్, గ్రామ సర్పంచ్ లక్ష్మీబాయి, ఉప సర్పంచ్ నౌసర్, వైద్యులు నవీన్ రెడ్డి, సిద్ధా ర్థ్, భాగ్యలక్ష్మి, ఆనంద్, రామకృష్ణ, ఎల్.వి. ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు రామ్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చలాన్‌ఫైన్ తేడాలపై 16 మంది
## కోర్టు కానిస్టేబుల్స్‌కు మెమోలు, సస్పెండ్

**చలాన్లలో తేడాలపై సీపీ సీరియస్**

**రామగుండం** : కోర్టు కానిస్టేబుల్స్‌కు సస్పెండ్, మెమోలు మంచిర్యాల జిల్లాకు చెందిన కొంతమంది కోర్టు కానిస్టేబుల్స్ పై జనవరి 2024 నుండి జూన్ 2026 వరకు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చలాన్,ఫైన్ విషయంలో ఆన్లైన్ ఆఫ్లైన్లో బారీ తేడాల నేపథ్యంలో రామగుండం సిపి 16 మంది కోర్టు కానిస్టేబుల్స్ కు కొందరి మెమో జారీ చేయ్యగా మరి కొందరిని సస్పెండ్ చేసినట్లు సమాచారం.

## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం:

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్** : కరీంనగర్ నగర ప్రజలకు సమస్యగా మారిన డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం 52వ డివిజన్‌లో పర్యటించిన ఆయన, క్రిస్టియన్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ సరిల్ల రాజకుమారి ప్రసాద్‌తో కలిసి రూ.24 లక్షల ఎస్ యుడిఎనిధులతో చేపట్టనున్న ఎస్ డబ్ల్యూజి డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. డంపింగ్ యార్డు ప్రక్షాళనకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా రూ.17 కోట్లు కేటాయించి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఈఎన్ సి అనుమతులు పొందినట్లు మేయర్ తెలిపారు. త్వరలో బయోమైనింగ్ పనులు ప్రారంభిస్తామని, యుసిఎఫ్ పథకం కింద మరో రూ.80 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. 52వ డివిజన్ అభివృద్ధికి యుఐడిఎఫ్ కింద రూ.1 కోటి కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగరంలో బతుకమ్మ, దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత మండప కర్ర పూజ

**ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్ :** కరీంనగర్ సిటీ కాశ్మీర్ గడ్డ ప్రాంతంలోని ఫండస్ స్కూల్ కూడలిలో గణేష్ యూత్ మాజీ కార్పొరేటర్ టి.శ్రీదేవి- చంద్రమౌళి ఆధ్వర్యంలో దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిష్టించనున్న దుర్గామాత మండప నిర్మాణ పనులకు కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలతో కర్ర పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫండస్ స్కూల్ యాజమాన్యం ప్రభాకర్ రెడ్డి, గణేష్ యూత్ ప్రతినిధులు శ్రీరామ్, రూపేష్, ఐలేని రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, సంటి అశోక్, స్థానిక నాయకులు, మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం

**జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్**

**మహబూబాబాద్ :** క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యమని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్ అన్నారు. టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలో ని కాన్ఫరెన్స్ హాలులో అన్ని మండలాల ఎంపీడీవోలతో కలిసి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డ ఆవిష్కరించిన జోష్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి టీబి కి అన్ని రకాల పరీక్షలు చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా లభిస్తుందని తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రతి నెల ప్రభుత్వం ?1000 పోషక ఆహార నిమిత్తం అందిస్తుందని, ప్రతి ఒక్కరు టీబి పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు, అవగాహనతోనే టీబి అంతం చేయవచ్చని టిబి అంతం చేయడం కొరకు అందరు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా టీబి రహిత గ్రామ పంచాయతీ లు గా ఎంపికైన 13 మంది సర్పంచులను సన్మానించడం జరిగింది . జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలను టీబి రహిత గ్రామపంచాయతీగా తీర్చడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్పంచులు టీబి ముఖ్య సిబ్బంది పాల్గొన్నారు.